ఇంద్రియాలచేత, మనస్సుచేత నువ్వు చాకిరీ చేయించుకొంటున్నావు అనుకో అప్పుడు ఈ జబ్బులోనుండి బయటకు వచ్చేస్తావు. మనం చైతన్యం చేతిలో పనిముట్లుగా లేము, అహంకారంచేతిలో పనిముట్లుగా ఉంటున్నాము. రాముడికి ఉపకారం చేసి విభీషణుడు, సుగ్రీవుడు రాజ్యాలను పొందారు. గుహుడు నదిని దాటిస్తూ రాముడితో నేను నిన్ను ఈ నదిని దాటిస్తున్నాను, ఈ జననమరణ ప్రవాహం నుండి నన్ను నువ్వు దాటించు, నాకేమీ అక్కరలేదు అన్నాడు. రామపట్టాభిషేకం తరువాత రాముడు అందరికీ అన్నీ ఇస్తాడు. కాని ఆంజనేయస్వామి దగ్గరకు వచ్చేటప్పటికి ఏమి ఇవ్వాలో ఆయనకు అర్థంకాలేదు. ఏమి ఇవ్వాలో అర్థంకాక ఆంజనేయస్వామిని కౌగిలించుకొన్నాడు అంటే ఆయనను ఆయనే ఇచ్చేసుకొన్నాడు అంటే ఆభక్తి అట్టిది, ఆప్రేమ అట్టిది.

నీ అహంకారం కోసం పని చెయ్యవద్దు, భగవంతుడు ఎలా చెపితే అలాపనిచెయ్యి. భగవంతుని చేతిలో పనిముట్టుగాఉండు భగవంతుడు ఒకమాట చెపితే అది మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా, భగవంతుడు చెప్పిన మాటను ఇష్టం చేసుకొని అలాపనిచేయ గలిగితే ఆయన దయకు పాత్రులవుతాము. మిమ్మల్ని ఎవరైనా ద్వేషిస్తున్నారు అనుకోండి ఆద్వేషాన్ని చూడకు, ఆద్వేషంలోకూడా భగవంతుడినే చూడు. భగవంతుడికి భిన్నంగా ఏదైనా చూస్తూఉంటే అది నీ దుఃఖానికి కారణం అవుతుంది. భగవంతుడిది భగవంతుడికే ఇచ్చి మనంఇచ్చాము అనుకొంటున్నాము, మనం ఆధ్యాత్మికంగా చిన్నపిల్లలం. అంతా భగవంతుడే మనం అన్నంతినేటప్పుడు కూడా ఇది భగవంతుడిదే అనుకొని తింటే మనం తినే అన్నం ప్రసాదం అవుతుంది. మీరు పూజచేసుకోండి మంచిదే, జపధ్యానములు చేసుకోండి మంచిదే వీటివలన మన మనస్సులో ఉన్న కషాయం అంతా బయటకుపోతుంది. భగవంతుడు చెప్పిన మాటయందు మనకు ప్రమాణబుద్ధి ఉండాలి. దేవుడు, దేవుడు చెప్పినమాట వేరుకాదు. కాని అది మనకు అర్థంకావటంలేదు అంటే మనకు సమాన బుద్ధిలేదు. మనబుద్ది ముగ్గాలి. మనం లోకంలో పనులు చేస్తున్నప్పటికి బుద్దిని భగవదనుభవం పొందటానికి సమాయత్తం చేయాలి. బుద్దికి ప్రిపరేషన్ లేకుండా భగవంతుడు చెప్పిన మాటలు విన్నా అవి మన గుండెకు తాకవు. అంటే చేను దమ్ము చేయకుండా ఊడిస్తే ఎలా ఉంటుందో మనస్సు సమాయత్తం అవ్వకుండా భగవంతుడు చెప్పిన మాటలు విన్నా అలాగే ఉంటుంది.

ఇప్పుడు మనకు జీవితానికి మరణానికి బేధం తెలుస్తోంది. ఇప్పుడు ఉన్నాము అనుకొంటున్నాము దేహం మరణించిన తరువాత ఉండము అనుకొంటున్నాము. ఆబేధం తెలియనిస్థితిని పొందటమే అమృతానుభవం. అది ఇప్పుడు మన జీవితంలో సాధించాలి అదే మన గమ్యం. దానిని దృష్టిలోపెట్టుకొని మీరు పనులు చేసుకోండి. సమాజానికి



మీరు చేసేసేవ, మీ జీవితవిధానం ఎలా ఉండాలంటే అది అమృతానుభవం పొందటానికి సహకరించేలా ఉండాలి. మీరు గౌరవాలకోసం, గొప్పలకోసం పనులుచేస్తే కీర్తి వస్తుంది, అసలుసున్న, అమృతానుభవం కలుగదు. మీరు యజ్ఞాలు, యాగాలు చేస్తున్నారు, చనిపోయిన తరువాత స్వర్గానికి వెళతారు అంటే ఇవిఅన్నీ చేస్తున్నారు. స్వర్గంనిజం కాదు, అది వ్యవహారిక సత్యం మాత్రమే, అదిలేదు, ఉన్నదానివలె కనిపిస్తోంది. మీకు ఉన్నది కావాలా, ఉన్నదానివలె కనబడేది కావాలా అంటున్నారు. ఉన్నది ఒక్కటే, దానిని పొందటానికి ప్రయత్నించు. ఉన్నదానివలె కనిపించే వాటిని పొందటానికి ప్రయత్నం చేస్తూఉంటే ఈ జననమరణములు అనే జబ్బులోనుండి బయటకు రాలేవు. గుణాలు, గుణాలకు సంబంధించిన విషయాలు, యజ్ఞాలు యాగాలు వాటి వలన వచ్చే ఫలితాలవైపు నీమనస్సు వెళ్ళిపోతోంది అనుకో నన్ను పొందలేవు అని భగవంతుడు చెపుతున్నాడు. మన బుద్దిలో మెరకా పల్లాలు ఉన్నాయేమో రోజూ చూసుకొంటూఉండాలి, ఒకవేళ ఉంటే సరిచేసుకోవాలి. ఏక్షణానికి ఆక్షణం జాగ్రత్తగా ఉండాలి. అశ్రద్ధపనికిరాదు, అవినయం పనికిరాదు. మీరు ఇటుకలతోటి, సిమ్మెంటుతోటి గుడి కడితే మీకు పుణ్యం రావచ్చుకాని ఎవడైతే తన హృదయాన్ని దేవాలయంగా చేసుకొన్నాడో వాడికి మోక్షం వస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 5-3-04, సీసలి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏదేహం ద్వారా ఏపనిని చేయించాలో ఆదేహం ద్వారా ఆపనిని భగవంతుడు చేయిస్తూ ఉంటాడు. భగవంతుడి దయలేకుండా మన హృదయంలో జ్ఞానోదయం అవ్వదు. చైతన్యం గురించి గీతలో, ఉపనిషత్‌లలో ఏ విధంగా చెప్పారో అలాగ బాబాగారు, రమణ మహర్షి, ఆచార్యులవారు జీవించి చూపించారు. అంటే ఉపనిషత్‌లలో ఉన్న మాటలు సత్యాలు అని నిర్ధారణ చేసారు. సాధన లేకుండా సిద్ది కలుగదు. ఉపాసన లేకుండా వాసన నశించదు. మన ఇష్టదేవతను ఆరాధించగా ఆరాధించగా, ఆనామాన్ని స్మరించగా స్మరించగా, మన హృదయంలో ఆ నామరూపములను నిలబెట్టుకొంటూఉంటే పూర్వజన్మలనుండి వచ్చిన వాసనలు నశిస్తాయి. వాసనలు పూర్తిగా వేరుతోసహా నశిస్తేగాని చైతన్యం అనుభవంలోనికి రాదు. మీరు అందరూ ఎంతోకొంత సాధన చేస్తున్నారు గాని మీకు ఆహారనియమం లేకపోతే ప్రయోజనం లేదు. మనం తినే ఆహారాన్ని బట్టి శరీరం, మనస్సు తయారవుతుంది. కొన్ని కొన్ని శరీరాలకు కొన్ని పదార్థాలు పడవు, అవి మానేస్తూ ఉండాలి. పడినపదార్థాలు కూడా అతిగా తినకుండా తగుమాత్రంగా తింటూ దేహయాత్రను నడుపుకొంటూ సాధనకు జీవితాన్ని వినియోగించుకోవాలి. మనలోపల ఉన్న సద్వస్తువు

మనకు అందాలంటే తిండి విషయంలో, మాటల విషయంలో, ప్రవర్తన విషయంలో జాగ్రత్త అవసరం. అతినిద్ర పనికిరాదు, అకాలభోజనం పనికిరాదు అని పెద్దలు చెపుతారు. అకాల భోజనం అంటే కొంతమంది ఈ రోజు సాయంత్రం 6 గంటలకు భోజనం చేస్తారు, రేపు రాత్రి 10 గంటలకు భోజనం చేస్తారు, అది మంచిది కాదు. మనకు ఈ శరీరం, మనస్సు సహకరించకపోతే ఆత్మజ్ఞానం కలుగదు. మనం నిరంతరం భగవంతుడిని స్మరించుకొంటూఉంటే మన హృదయం నిండుతుంది. మనం పొట్టను ఎలా నింపుకోవాలి, ఇల్లును ఎలా నింపుకోవాలి అని చూస్తున్నాము గాని హృదయాన్ని ఎలా నింపుకోవాలి అనే ఆలోచన మనకు లేదు.

ఉన్నది ఒక్కటే వస్తువు, బ్రహ్మం ఒక్కటే. ఇది అన్నంకుండ, ఇది పులుసు కుండ, ఈకుండ వేరు ఆకుండ వేరు అని మనం అనుకొంటాము కాని ఆ కుండలు అన్నీ మట్టితో తయారుచేయబడ్డాయి. అలాగే మనం అనేక నామరూపములు చూస్తున్నప్పటికి అంతా బ్రహ్మమే. కాని నీవు వేరు, నేను వేరు అని మనం అనుకొంటాము, ఆ వేరుబుద్ధిలో నుండి వైరబుద్ధి వస్తుంది. లోకంలో అనేకమంది విద్యావంతులు, ఐశ్వర్యవంతులు, అధికారులు ఉన్నారు కాని ఎవరూ సుఖంగా, శాంతిగా, ఆనందంగా లేరు. లోపల దుఃఖపడే వాడు ఉన్నంతకాలం మీకు ఎన్నికోట్ల ధనం ఉన్నా, ఎంత ఆస్తి ఉన్నా మీరు ఏడుస్తూనే ఉంటారు. వాడు ఎవడో జాగ్రత్తగా విశ్లేషణ చేసి, వాడిని తొలగిస్తేగాని లోపల హృదయంలో ఉన్న శాంతి, ఆనందం మనకు అందదు. అసూయ ఉన్నవాడికి ఆత్మజ్ఞానం రాదు, మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం కూడా తగ్గిపోతుంది. ఈశ్వరుడు అంతటా ఉన్నాడు, ఆయన సర్వశక్తిమంతుడు, సర్వసాక్షి. మనకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి కాని ఆయనకు తెలియని విషయం ఏమీ లేదు. అటువంటి ఈశ్వరుడిని మన హృదయంలో పెట్టుకొని ఏడుస్తూ కాలక్షేపం చేస్తున్నాము, ఎవరిని చూసినా ఏడుపు ముఖాలే. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నీవు ఏదోపని చేస్తే పుణ్యం రావచ్చు లేకపోతే పాపంరావచ్చు, అవి అనుభవిస్తే పోతాయి. ఈ పుణ్యపాపములు దేహగతమైననేనుకు సంబంధించిన విషయాలు కాని మన హృదయంలో లోపలకు వెళ్ళిచూస్తే అక్కడ ఉన్న సత్యవస్తువు ఈ పుణ్యపాపాలకు, చావుపుట్టుకలకు అతీతమైన మహావెలుగు అది, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అక్కడ ఉన్న పరమశాంతి, అక్కడఉన్న ఆనందం విజృంభించి వచ్చి మనసహస్రారాన్ని ముంచుతూఉంటే వైకుంఠం కూడా మీకు గడ్డిపరకలాగ అనిపిస్తుంది, అది అక్కడ ఉన్న ఆనందం. మనం అన్నం తినేటప్పుడు పచ్చిమిరపకాయముక్కలు వస్తే వాటిని తీసి ప్రక్కన పెడతాము. అలాగే మన లోపల దుఃఖపడేవాడు ఎవడైతే ఉన్నాడో, ఎవడైతే లోపల ఉండి నీకు వేదనను రోదనను కలుగజేస్తున్నాడో, ఎవడైతే నీకు వేరుభావన తీసుకొని వస్తున్నాడో



వాడిని తీసి ఒక ప్రక్కన పెట్టు అప్పుడు హృదయంలో ఉన్న ఈశ్వరుడు నీకు అనుభవంలోనికి వస్తాడు. అప్పుడు ఎక్కడికో ఇతరలోకాలకు వెళ్ళాలనే బుద్దినీకు కలుగదు. అట్టిది ఆఅనుభవం. మనకు అశాంతి ఎందుకు వస్తోంది, వేదన ఎందుకు వస్తోంది, అసలు మనకు దుఃఖం ఎందుకు వస్తోంది లోపల వీటి అన్నింటికి ఎవడు కారణము, వాడిని తీసేసుకొందాము అనే బుద్ధి మనకు రావటంలేదు. ఏదోచేద్దాము, ఎక్కడికో వెళ్ళిపోదాము అనేగాని వీడిని, ఈ బుజ్జిగాడిని తీసి బయటపెట్టాలి అనే తలంపు మనకురావటంలేదు. యజ్ఞం చేస్తే ఆపుణ్యం వస్తుంది, యాగంచేస్తే ఈపుణ్యం వస్తుంది గొప్పలోకాలకు వెళ్ళిపోవచ్చు అనుకొంటున్నాము. పోనీగొప్పలోకాలకు వెళ్ళిపోతారు అక్కడ ఎంతకాలం ఉంటారు, ఆపుణ్యం ఖర్చు అయిపోయినతరువాత తిరిగి ఈభూమి మీదకు రావలసిందే. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. వీటికి లోపల ఎవడు ఆకర్షింపబడుతున్నాడు అని మనలో మనం ప్రశ్నించుకొంటూ ఉండాలి. ఎవరోవచ్చి బాగుచేస్తారని కనిపెట్టుకొని ఉండకూడదు. మనలను మనం బాగుచేసుకోటానికి ప్రయత్నంచేయాలి. మన మనస్సును, ఇంద్రియాలను మనకు అనుకూలంగా తిప్పకోవాలి. మనం బాగుపడటానికి కష్టపడి సాధనచేస్తూ ఉంటే మనకృషే కృపగా మారుతుంది. ఎక్కడయితే కృషి ఉందో, ఎక్కడయితే కృప ఉందోఅక్కడ ఐశ్వర్యం ఉంటుంది, మోక్షంకూడా ఉంటుంది అని భగవంతుడు చెప్పాడు.

భగవంతుడు మనహృదయంలోనే ఉన్నాడు. ఆయన దయను పొందటానికి, ఆయన ప్రేమకు పాత్రులం అవ్వటానికి ఏది మనకు అడ్డువస్తుందో దానిని తీసి ఒక ప్రక్కన పెట్టటమే మనసాధన యొక్క గమ్యం. ఈశ్వరుడు ఉన్నాడు అనేభావన మనకు స్థిరంగా ఉండాలి. ఈశ్వరుడిని హృదయపూర్వకంగా నమ్మిజీవించగలుగుతూ ఉంటే, ఈశ్వరస్మరణ విడిచిపెట్టకుండా ఉంటే ఆయనే ఎప్పుడో సడన్‌గా ముహూర్తం పెట్టుకొని మీ బుద్ధికి వివేకాన్ని ఇస్తాడు, మీకు సూక్ష్మబుద్ధిని కలుగజేస్తాడు, ఆయనను అర్థంచేసుకొనే శక్తి ఆయనే ఇచ్చి, ఆయనే మీకు అనుభవంలోనికి వస్తాడు. మనం జీవించటం అహంకారంకోసం జీవిస్తున్నాము కాని భగవంతుడిని తెలుసుకోవాలనుకొంటున్నాము, ఇలా మనకు అలవాటు అయిపోయింది. మనస్సుకు అనారోగ్యం తీసుకొని వచ్చే తలంపులు రాకుండా చూసుకోవాలి. భగవదనుభవం పొందటానికి ఏతలంపులు అయితే అడ్డువస్తున్నాయో వాటిని వదలించుకోవాలి. సాధనచేస్తూ ఉంటే సాధనాబలం వలన, ఈశ్వరునిదయ వలన కాలక్రమంలో అవి అన్నీ పోతాయి. మీలోపల ఉండి ఎవడైతే దుఃఖపడుతున్నాడో వాడుపోతే మీశరీరంతో సంబంధంలేకుండా మీరు అంతటా వ్యాపించి ఉంటారు, అప్పుడు మీకు ప్రయాణాలు ఆగిపోతాయి. ఆత్మను తెలుసుకో అంటే నిన్ను నీవు తెలుసుకో అని అర్థం. నన్ను నేను తెలుసుకొంటే ఆత్మతెలుస్తుంది అనే విషయం తెలియకుండా ఆత్మకోసం బజారులో

వెతుకుచున్నాము. నాకు కళ్ళు ఉన్నట్లు అద్దంలో చూసుకొంటేనే గాని నేను నమ్మను అంటే ఎలాగ ఉంటుందో నేను ఆత్మను అని ఎవరోచెపితే గాని నాకు తెలియటంలేదు అనటం అలాగే ఉంటుంది. కొంతమంది అవసరం లేకపోయిన డబ్బు ఖర్చుపెడతారు దానికి కారణం వారికి డబ్బుఅంటే ఇష్టం లేదు అని కాదు గొప్పలకోసం ఖర్చుపెడతారు. మనం ఏదైనా అవసరమైన మాటలు మాట్లాడాలి గాని అవసరంలేకుండా మాట్లాడేస్తూ ఉంటే అది గొప్పతనం ప్రదర్శించటం కోసమేఅవుతుంది, దానివలన మీకు వేదన ఎలాతగ్గుతుంది. యజ్ఞాలు, యాగాలు చేస్తున్నాము మరి మనలోపల ఉండి దుఃఖపడేవాడి మాట ఏమిటి? వాడిని తీసి ఒకప్రక్కన పెట్టటమే ఆధ్యాత్మికజీవితం యొక్క లక్ష్యం లోపల ఏకంగా ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి వస్తోంది అనుకో నీకు ఉన్న అలవాట్లు ప్రక్కకు తప్పకొని అది అనుభవంలోనికి రావటానికి దారి ఇస్తున్నాయి అనుకో అప్పుడు ఇంట్లో వ్యక్తులపట్ల, సమాజంలోని వ్యక్తులపట్ల, నీచేత చూడబడుతున్న ఈప్రపంచంపట్ల నీ ఆలోచనేమారిపోతుంది. వీడు శత్రువు అనీ, వాడు మిత్రుడు అనీ, వీడు మంచివాడని, వాడు చెడ్డవాడని విభజించే రేఖ చెరిగిపోతుంది, నీకు ఎటుచూసినా బ్రహ్మమే కనబడుతుంది. లోపల ఉన్న ఆనందం మీకు అందటంలేదు అనుకోండి ఏదోచేసేస్తున్నాం, ఏదో చేసేస్తున్నాం అంటే దానివలన మీకువచ్చే ప్రయోజనం ఏమిటి? మనం మనస్సుతో చూస్తున్నాము, మనస్సుతో వింటున్నాము. కాని మనం ఏమనస్సుతో అయితే చూస్తున్నామో, ఏమనస్సుతో అయితే వింటున్నామో దానిని తీసి ఒకప్రక్కన పెడితేనే గాని లోపలఉన్న వస్తువు మనకు తెలియబడదు అని మనకు అర్థంకావటంలేదు. లోపల చూస్తే ఏడుస్తున్నావు, నేను అది చేసేస్తాను, ఇది చేసేస్తాను అంటావు ఏమిటి? నీఅశాంతిని సమాజానికి పంచిపెడతావా, నీకున్న అవినయాన్ని గర్వాన్ని సమాజానికి పంచిపెడతావా? లోపల ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు మామూలుగా నీద్వారా పనిజరిగిపోతూ ఉంటుంది, నేను చేసేస్తున్నాను అని చెప్పే ఆనేను పత్తాలేకుండా పోతుంది. లోపల ఆ చైతన్య స్రవంతిలో నువ్వు ఐక్యమయినప్పడు నీ శరీరం ద్వారా ఏపని జరగాలో అది జరిగిపోతూ ఉంటుంది, నువ్వుటైర్అయ్యే సమస్యలేదు. ఈ శరీరం ఏదో రోజు రాలిపోతుంది, రాలిపోయేటప్పడు ఏదో అయిపోతున్నాము అని కూడా నీకు అనిపించదు, అది చైతన్యం యొక్క వైభవం. ఈ దేహాన్ని కాల్చిబూడిద చేయకముందే మీరు అమృతానుభవం పొందాలి. అది తప్ప మీరు ఎన్ని సాధించినా అవి అన్నీ కూడా స్వప్నసమానము. హృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు నీదేహం అహంకారంచేతిలో పనిముట్టుగా ఉండదు, ఈశ్వరుడి చేతిలో పనిముట్టు అవుతుంది. అప్పడు నీకు పుణ్యం ఏమిటి? పాపం ఏమిటి? అహంకారం చేతిలో పనిముట్టుగా ఉంటే పుణ్యం, పాపం. ఈశ్వరుడిచేతిలో నీశరీరం పనిముట్టుగా ఉన్నప్పడు, నీ కర్మకు ఆయనే కర్త అయినప్పడు నీకు పుణ్యం ఏమిటి? పాపం ఏమిటి? ఇక్కడ మనం చేయవలసింది ఏమిటి అంటే ఇప్పడు మన శరీరం అహంకారం స్వాధీనంలో ఉంది, అహంకారం పట్టులోనుండి తప్పించి హృదయంలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడికి స్వాధీనంచెయ్యాలి. అప్పడు మన దేహం దేవాలయం అవుతుంది. హృదయాన్ని దేవాలయంగా చేసుకొన్నవాడికి మోక్షం వస్తుంది. అజ్ఞాని ద్వేషంలేకుండా, అసూయలేకుండా ఉండలేడు. జ్ఞానికి అసూయ పెట్టుకొందామంటే సాధ్యంకాదు. మీరు వేరు, నేనువేరు అనుకొన్నప్పడు అసూయ వస్తుంది. అంతాతానే అయినప్పడు అసూయరావటానికి అవకాశంలేదు. మిమ్మల్నిచూస్తే నాకు అసూయరావచ్చుకాని నన్నుచూసుకొని నాకు అసూయరాదు. మన బుద్ధి పాడయిపోయింది, సోమరితనానికి అలవాటు పడిఉంది. ఇటువంటి పాడుబుద్ధికి భగవంతుడు అందడు. మన బుద్ధిని బాగుచేసుకొందాము అనే గొడవ నీకులేదు, ఏదో చేసేస్తాను అంటావు ఏమిటి? లోపల ఏడ్చేవాడిని పెట్టుకొని అక్కడ నుయ్యి తవ్విస్తాను, ఇక్కడ గోడ కట్టిస్తాను అంటావు ఏమిటి? మీరు ఏడుస్తూ ఎవరికైనా సహాయం చేస్తే వారూ ఏడుస్తూ ఉంటారు, మీ ఏడుపులో వారికి భాగం వెళుతుంది. ఈశ్వరుడిని నిరంతరం స్మరిస్తూ ఉంటే, ఈశ్వరుడు చెప్పిన వాక్యాన్ని గౌరవిస్తూ ఉంటే దేహముతో తాదాప్యం పొందే తలంపు దానంతట అదే రాలిపోతుంది, నీవు దానిని ప్రత్యేకంగా వూడగొట్టుకోనక్కరలేదు.

మాదేహం అంటే మాకు ఇష్టంగా ఉంది, లోకం అంటే ఇష్టంగా ఉంది, ఏదో దేవుడు అని మీరు అంటున్నారు, ఆ దేవుడి మీద మాకు ఇష్టం కలగటంలేదు అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. మనంపైకి చెప్పము కాని వీడు ఎవడో పైకికక్కుతున్నాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే ఇప్పడు నీవు నేను నేను అంటున్నావుకదా, ఆనేను సత్యమైనదికాదు, అసత్యమైన నేను, అందుచేత అది అసత్యంతో తాదాప్యం పొందుతుంది కాని సత్యంతో తాదాప్యం పొందదు. కొంతమంది తల్లితండ్రులు పిల్లలతో మీరు చెడ్డవారితో స్నేహం చేయవద్దు అని చెపుతారు. వాళ్ళ పిల్లవాడే చెడ్డవాడు అని వారికి తెలియదు. మనలో చెడ్డ ఉన్నప్పడే మనకు చెడుస్నేహాలు చేయాలని అనిపిస్తుంది. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. మనలో చెడ్డబుద్ధి లేనప్పడు చెడుస్నేహాలు చేయాలని అనిపించదు. మా వాడు స్నేహాలు పట్టి పాడైపోయాడు అని కొంతమంది అంటూఉంటారు, వీడు ఎంతమందిని పాడుచేసాడో వారికి అక్కరలేదు, వాళ్ళ అబ్బాయి మీద ఉన్న మోహంకొలది అలా అనిపిస్తుంది. అజ్ఞానంలో నుండి మోహంవస్తుంది. మనం ఎవరిమో మనకు తెలియకపోవటమే అజ్ఞానం అంతకంటే అజ్ఞానం అంటూ ఏమీలేదు. కొంతమంది ఏది మాట్లాడినా వారి అహంకారాన్ని

సంతృప్తి పరచుకోవటం కోసం మాట్లాడతారు. మీ ఆరోగ్యం బాగాలేదని తెలిసికూడా మీరు ఆరోగ్యంగా ఉన్నారా, మీరు బాగున్నారా అని అడుగుతూ ఉంటారు. వారికి బాగాలేదని మనకు తెలుసుకదా ఇంక అడగటం ఎందుకు, ఏదో మర్యాదకోసం అడుగుతున్నట్లు, ఇది అంతా అహంకారం యొక్క చేష్ట, ఇది అర్థం చేసుకొని మనం చెయ్యగలిగినది ఏదో చెయ్యటం, లేకపోతే ఊరక ఉండటం. ఏదో లోకం గొడవలలో కాలక్షేపం చేసేస్తున్నారు. నేను అది సాధించాను, ఇది సాధించాను అనుకొనేవాడు ఎవడు? శరీరం చనిపోయాక ఎక్కడికో కైలాసానికి, వైకుంఠానికి వెళ్ళిపోదాము ఇలా అనుకొనేవాడు ఎవడు అని విచారణ చేయటానికి మీకు టైములేదు. ఇది దురదృష్టకరం. దానికి కారణం ఏమిటి అంటే అలావిచారణచేయటానికి తగిన బుద్ధిసూక్ష్మత మీకులేదు, తగిన పుణ్యబలం మీకులేదు, మీరు పూర్వజన్మలలో నిష్కామకర్మ చేసిఉండలేదు.

మన మనస్సు మన రూపాన్ని అయినాపట్టుకొని ఉంటుంది. ఇంట్లోవారి రూపాలను అయినా పట్టుకొని ఉంటుంది లేకపోతే స్నేహితుల రూపాలనుగాని విరోధుల రూపాలనుగాని పట్టుకొని ఉంటుంది. ఇలా ఏదో రూపాన్ని పట్టుకొని ఏడవటమేదానిపని. అందుచేత దేవుడికి ఒకగుడి కట్టించి, అక్కడ ఆయన రూపాన్ని పెట్టి ఆరూపాన్ని పట్టుకొని ఉండు. నువ్వురూపరహితంగా ఉండలేకపోతున్నావు అందుచేత ఆయన రూపాన్ని పట్టుకొని ఉండు. ఒక్కగాఢనిద్రలో తప్పించి మనకి జాగ్రదవస్థలో అంతా ఏదో రూపాన్ని పట్టుకొని ఏడుస్తూ ఉంటాము. ఎలాగయినా ఏడుపు తప్పటంలేదు కదా, ఈరూపాలను పట్టుకొని ఏడ్చేబదులు, భగవంతుడికి ఒకరూపం కల్పించి ఆరూపాన్ని పట్టుకొని ఏడిస్తే యోగం సిద్ధిస్తుంది, నీమనస్సుకు ఏకాగ్రత వస్తుంది, చల్లదనం వస్తుంది, లోకంతోఉన్న బంధంలోనుండి నీవు విడుదల పొందుతావు. సమాజంలో ఉన్న మనుషులతో చెప్పి ఏడిస్తే నిన్నుయాగీచేస్తారు, భగవంతుడి దగ్గరకు వెళ్ళి ఏడిస్తే వాడు యాగీచేయడు, ఆఏడ్చేవాడిని తీస్తేసాడు. ముందు నువ్వు పొందవలసింది ఏమిటో తెలుసుకో, లోపల ఏడ్చేవాడు ఉండగా వాడిని తొలగించుకోవటం మానివేసి ఏదో చేస్తాను, ఏదో చెస్తాను అంటావు ఏమిటి? ముందు గమ్యం ఏమిటో నిర్ణయించుకో, తరువాత ఆ గమ్యంవైపుగా నీజీవితాన్ని, నీసాధనను గురిపెట్టు, అటువైపుగా నీవు ప్రయాణంచెయ్యి. మనం అవసరంలేని మాటలు మాట్లాడుతూఉంటే, ఉపయోగంలేని పనులు చేస్తూ ఉంటే మన అహంకారం బలిసిపోతుంది, స్థూలబుద్ధి పెరిగిపోతుంది. ఇది జ్ఞాపకం పెట్టుకోండి. మనందరం ఇక్కడ కూర్చొన్నాము, మనకు తలంపులు వస్తున్నాయి, అసలు తలంపులు ఎందుకు రావాలి. దానికి ఒకటే కారణం, మనకు ఏ తలంపు వచ్చినా మంచితలంపు వచ్చినా చెడుతలంపు వచ్చినా దానికి దేహమే కారణం, దేహము నేను అనే తలంపులోనుండే అన్నీ వస్తున్నాయి, పుండు అంతా ఇక్కడే ఉంది. అందుచేత నేను అనే తలంపు ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీలేదు అన్నారు భగవాన్.

మీరు నిజంగా పుట్టారా అని ఆచార్యులవారు అడుగుతున్నారు. ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే ఎవడిది నిజమైన పుట్టుక అంటే మళ్ళీ తిరిగి పుట్టుకరాకుండా ఎవడైతే చేసుకొంటున్నాడో వాడే నిజంగా పుట్టినట్లు అని చెప్పారు. రోజూ చచ్చేవాడికి, పుట్టేవాడికి అంటే మరణించటం తిరిగి జన్మించటం జరుగుతూ ఉంటే ఈ లెక్కలు ఎందుకు. తిరిగి పుట్టుకరాకుండా మీరు చేసుకోగలిగితేనే ఈ పుట్టుక యొక్క సార్థకత. ఒక శరీరం వచ్చింది, ఈ శరీరాన్ని, మనస్సును జాగ్రత్తగా ఉపయోగించుకొని, ఇక్కడ ట్రైనింగ్ పొంది, మరల కొత్తశరీరం రాకుండా చేసుకోగలగాలి. కొత్తశరీరం వచ్చినా ఇలాగే ఉంటుంది, అది మరల చనిపోతుంది. తిరిగి నువ్వు పుట్టకుండా చూసుకోవాలి తదనుగుణంగా నీ శరీరాన్ని, మనస్సును, కాలాన్ని ఉపయోగించుకోవాలి. దేహమే ఆత్మ, దేహమే సర్వస్వం, దేహమే నేను అనే పిడికిలి మనలను గట్టిగా పట్టుకొంది దానిలో నుండి విడుదలపొందాలి అని నేను చెపుతున్నాను. భగవాన్ ఏమంటున్నారు అంటే నువ్వు ఎప్పుడైనా ఆ పిడికిలిలో ఉంటేకదా అంటున్నారు. మనం బంధంలో లేము, మోక్షంలోనే ఉన్నాము కాని బంధంలో ఉన్నాము అని అనుకొంటున్నాము ఇలా అనుకోవటం మనకు అలవాటు అయిపోయింది. ఆ అలవాటును పోగొట్టుకొంటే నువ్వు మోక్షంలోనే ఉన్నావు అన్న సంగతి నీకు ఎరుకలోనికి వస్తుంది. ఉన్నది ముక్తిలోనే ఉన్నావు, అనుకోవటం బంధంలో ఉన్నాను అని అనుకొంటున్నావు. నీవు బంధంలో ఉన్నాను అని అనుకొంటున్నావు కాబట్టి నీకులోకం నిజంగా ఉంది, నీచావు నిజంగా ఉంది, నీకష్టం నిజంగా ఉంది, నీసంపద నిజంగా ఉంది. నేను బంధంలో ఉన్నాను అని అనుకోవటంవలన నిజం కానివి అన్నీ నిజంవలె నీకు కనిపిస్తున్నాయి. ఈ అనుకోవటం మానివేస్తే ఏమీలేదు. ఈ దేహం శవం అయ్యేలోపు నూటికి నూరుపాళ్ళు ఎవడైతే దుఃఖరహితస్థితిని పొందాడో వాడికి నిర్వాణసుఖం అందుతుంది, ఒక్క పాయింటు దుఃఖం మిగిలి ఉన్నా వాడికి పునర్జన్మ వచ్చితీరుతుంది, ఎవడూ దానిని ఆపుచేయలేడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 01 నుండి 08-06-2004 వరకు | హైదరాబాద్ క్యాంపు | |
| 20-06-2004 ఆదివారం | జిన్నూరు శ్రీ రమణక్షేత్రం | |



**ది. 30-5-04 ఆదివారం పాలకొల్లులో అంబికా జ్యూయలర్స్‌ను ప్రారంభిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు, 'సమాజసేవాభూషణ్' శ్రీ నాళం బాపిరాజు గారు పాల్గొన్నారు.**

### రమణభాస్కర పాఠకులకు మనవి

రమణభాస్కర పత్రికకు అడ్రస్సు సరిగ్గా ఇవ్వని కారణంగా చాలా పుస్తకాలు తిరిగి వచ్చుచున్నవి. రమణభాస్కర అందకపోయిన, మీ అడ్రస్సు మారిన, వెంటనే మీ పేరు ముందు ఉన్న నెంబరును వ్రాస్తూ డోర్ నెంబరు, వీధిపేరు, ఏరియా, పిన్‌కోడ్ తో సహా సరియైన పూర్తి చిరునామా వ్రాయండి. వెంటనే పంపబడతాయి






**ది. 31-5-04 సోమవారం తాడేపల్లి గూడెంలో శ్రీరమణమహర్షి పబ్లిక్‌స్కూలు ప్రారంభిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు**

